క్లుప్తంగా

చెరువులను పూర్తిస్థాయిలో నింపాలి


కాజతూర్పులో చెరువును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ సత్యనారాయణ

యలమంచిలి: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని నరసాపురం డీఎల్‌పీఓ జె.సత్యనారాయణ అన్నారు. చించినాడ, ఊటాడ, యలమంచిలి, కాజ తూర్పు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. కాలువలు కట్టేసే సమయానికి చెరువుల్లో కనీసం 40 శాతం నీరు ఉండేలా ఇప్పుడే చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి చెరువులకు వంతు ఇచ్చిన సమయంలో పూర్తిస్థాయిలో నింపాలని అదేశించారు. పైపులైన్, కుళాయి లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. డీఎల్‌పీఓ వెంట ఈఓపీఆర్డీ షరీఫ్, పంచాయతీ కార్యదర్శులు పాలా శారద శ్రీనివాస్, మాదాసు హరి ప్రసాద్, కిషోర్ తదితరులున్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు


పోడూరులో పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుహాసిని

పోడూరు: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా తగినచర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ డి.సుహాసిని సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. పోడూరు, జిన్నూరు గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో రక్షిత మంచినీటి చెరువులు, ఫిల్టర్‌బెడ్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులను, పంప్‌హౌస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సర్పంచ్‌లు శెట్టిబత్తుల సువర్ణరాజు, జమ్ము బేబీ మహలక్ష్మి, ఈఓపీఆర్‌డీ ఎం.బలరామరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బుజ్జేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు వి.రాంబాబు, పి.రవి ఉన్నారు.

పేరుపాలెంలో పోలీసుల కవాతు


పేరుపాలెంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది

మొగల్తూరు : ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో మనోధైర్యం నింపేందుకే కవాతు నిర్వహిస్తున్నామని సీఐ కె.గోవింద్‌రాజు అన్నారు. సోమవారం మొగల్తూరు మండలం పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లోని అంగజాలపాలెం, తెన్నేటిపేట, కవురువారిపాలెం తదితర ప్రాంతాల్లో సీఐఎస్ఎఫ్, సివిల్ పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ జర్నాల్ సింగ్, అసిస్టెంట్ కమాండెంట్ రామాన్ జీ, మొగల్తూరు ఎస్సై కె.వెంకట రమణ, తహసీల్దార్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై చంద్రబాబు ద్వేషం


దిద్దే శ్రీనివాస్

పోడూరు: ఒక ట్రిప్పర్ డ్రైవర్‌కు సీఎం జగన్ అసెంబ్లీ సీటివ్వడంతో రాయలసీమ ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు దళితులు, మాదిగలపై చంద్రబాబు మరోసారి ద్వేషం చూపించారని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి దిద్దే శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు వాఖ్యలను బట్టి మాదిగలు డ్రైవర్లుగా కూడా పనికిరారా అని ప్రశ్నించారు. విద్యావంతుడైన ట్రిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులకు సీఎం జగన్ వైఎస్సార్ సీపీ తరపున సింగనమలై సీటు ఇచ్చారని తెలిపారు. దళితుడైన ట్రిప్పర్ డ్రైవర్‌ను చంద్రబాబు హీనంగా చూస్తే సీఎం జగనన్న అసెంబ్లీలో కూర్చోబెట్టేందుకు సీటిచ్చి దళితుల పట్ల తనకున్న చిత్తశుద్ధిని నిరూపించారని వివరించారు. ఓట్ల కోసం మాదిగలను వాడుకుని అధికారంలోకి వచ్చాక మాదిగలను అణగదొక్కిన చరిత్ర చంద్రబాబుదని గుర్తుచేశారు. వీరాంజనేయులను ఉద్దేశించి ట్రిప్పర్ డ్రైవర్‌కు సీటిచ్చారని హేళన చేసిన చంద్రబాబు వాఖ్యలను మందకృష్ణ మాదిగ ఎందుకు ఖండించలేదని, ఎందుకు స్పందించలేదని శ్రీనివాస్ ప్రశ్నించారు. మాదిగలను హీనంగా చూస్తున్న చంద్రబాబు కూటమికి మద్దతు ఉపసంహరించుకోవాలని మందకృష్ణ మాదిగను డిమాండ్ చేశారు. చంద్రబాబు కూటమిని ఓడించి బుద్ధి చెప్పడానికి మాదిగలంతా సిద్ధంగా ఉండాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


లోసరి గ్రామంలో మాట్లాడుతున్న తిరుమాని ఏడుకొండలు


దుంపగడపలోని తిమ్మరాజు కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భీమవరం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెట్టిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తిరుమాని ఏడుకొండలు అన్నారు. భీమవరం మండలంలోని లోసరి గ్రామంలో సోమవారం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి గత 58 నెలలుగా జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా తిరుమాని ఏడుకొండలు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. సీఎం జగన్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమమే ధ్యేయంగా ఐదేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేశారని వివరించారు. భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే జగన్ లక్ష్యమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వల్ల మేలు చేకూరిందని అనుకుంటేనే ఫ్యానుగుర్తుపై ఓటేసి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తో పాటు పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాలను కూడా గెలిపించాలని, జగన్‌మోహన్ రెడ్డిని రెండోసారి సీఎం కావడానికి కృషి చేయాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. 2019లో రెండోసారి ఎమ్మెల్యేగా గ్రంధి శ్రీనివాస్ 100 పడకల ఆస్పత్రి కోసం రూ. 16 కోట్లు విలువ చేసే 4 ఎకరాలు భూమి ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారన్నారు. అంతేకాకుండా జిల్లా కేంద్రంగా భీమవరం రావడానికి అందివచ్చిన మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేశారన్నారు. నియోజకవర్గం మొత్తం అర్హులైన సుమారు 15 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారన్నారు. నాడు -నేడు ద్వారా సర్కారు పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, ఆర్‌బీకే సెంటర్లు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించారన్నారు. గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా పనిచేశారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు ద్వారా ప్రతి కుటుంబానికి రూ. 50 వేలు నుంచి 10 లక్షలు వరకు లబ్ధి చేకూర్చి ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాడారన్నారు. ఈ కార్యక్రమంలో లోసరి గ్రామ అభివృద్ధి కమిటీ నాయకులు యాతం రామస్వామి (సాయి), సర్పంచ్ తిరుమాని శ్రీను, ఎంపీటీసీ బొమ్మిడి కొండరాజు, పెచ్చెట్టి సత్యనారాయణ, కొప్పినీటి సత్యనారాయణ, వెంకటస్వామి, తిరుమాని రాముడు, ఏడుకొండలు, బర్రి పెద్దిరాజు, కొల్లాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు బూటకపు వాగ్దానాలను నమ్మవద్దు

ఆకివీడు: మీ ఓటే మీ భవిష్యత్తును నిర్ణయిస్తుందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కురెళ్ల పోలు అన్నారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని తిమ్మరాజు కాలనీలో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు నియోజకర్గ అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమా బాల విజయాన్ని కోరుతూ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కురెళ్ల పోలు మాట్లాడుతూ ఎన్నికలు పూర్తవకుండానే చంద్రబాబు ప్రజల్ని హింసించే చర్యలు చేపట్టారని ఆరోపించారు. వలంటీర్లతో పింఛన్ ఇవ్వకూడదని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో నిలిపివేశారని ఆరోపించారు. ఈ నెల ఫించన్ సొమ్మును సచివాలయాలకు వెళ్లి తీసుకోవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలన్నీ బుట్టదాఖలు చేస్తాడని స్పష్టమవుతోందని అట్లూరి సంజయ్ అన్నారు. పథకాల్ని నిర్వీర్యం చేసి, ప్రజల్ని కష్టాలు పాలు చేయడానికి చంద్రబాబు అనేక కుట్రలు చేశాడన్నారు. వచ్చే ఎన్నికల్లో బూటకపు వాగ్ధానాలు చేసి అధికారంలోకి రావాలనుకుంటున్నాడని, వాటిని ప్రజలు నమ్మవద్దని కోరారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు కోయ అయ్యన్న మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడు తన ఓటును ఫ్యాన్ గుర్తుకు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ప్రచారంలో వార్డు సభ్యుడు తవిటి నాయుడు, మహిళలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలి



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి జి సీహెచ్ ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్టిసి బస్టాండ్ నందు ఓటు హక్కు వినియోగం పై ఓటర్లకు అవగాహన కార్యక్రమమును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్వీప్ నోడల్ అధికారి జి సి హెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకోవడం మన బాధ్యత, ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధం లాంటిదని అన్నారు. ప్రజలందరూ ఓటు హక్కును నిబద్ధతతో సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంచి పౌరులను ఓటు ద్వారా ఎన్నుకొని దేశ భవిష్యత్తును కాపాడుకోవాలన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ రంగసాయి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుకు మంచి విలువ ఉందని ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా సక్రమ పద్ధతిలో ఓటును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ నిబంధనలు పాటించండి శాంతి భద్రతలను కాపాడండి పోస్టర్లను ప్రజల సందర్శనార్థం ఆవిష్కరించారు. పురవీధుల్లో ర్యాలీ మానవహారం నిర్వహించారు. కళాజాత బృందం ద్వారా ఓటు హక్కు పై బుర్రకథ రూపంలో అవగాహన కల్పించారు. స్థానికులు, డ్రైవర్లు, కండక్టర్లు, పాల్గొని మేము ఓటు వేస్తాం మీరు ఓటు వేయండి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట్రామన్, ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి, ఆర్టీసీ సిబ్బంది, మెప్మా సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన


గొల్లలకోడేరులో మాట్లాడుతున్న ఎస్సై నాళం శ్రీనివాసరావు

పాలకోడేరు: ఎన్నికల్లో నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజలకు పోలీసులు ఎల్లవేళలా తోడుంటారని భరోసా కల్పిస్తూ సోమవారం మండలంలోని గొల్లలకోడేరు, కుముదవల్లిలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాసరావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రజలు అధైర్య పడకుండా రాజ్యాంగం ద్వారా సంక్రమించిన తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శక నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు పోలీసులు ప్రజలకు ఎల్లవేళలా తోడుంటారని, ఎలాంటి చట్టవ్యతిరేక అసాంఘిక సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైన ఉందని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పక్షాలు, ప్రజలు పోలీసులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో అసత్య ఆరోపణ చేస్తూ పోస్టింగులు పెడితే కేసులు నమోదు చేస్తామన్నారు. సైబర్ మోసాలకు గురైనట్లయితే 1930కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం నాయుడు, వీఆర్వోలు ఇందిర, సుబ్రమణ్యం, మహిళా పోలీస్ కోనాల బేబి, గ్రామస్తులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం


మజ్జిగ చలివేంద్రంను ప్రారంభిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు

ఆకివీడు: వేసవిలో దాహార్తిని తీర్చేందుకు మాదివాడలోని రంగా విగ్రహం వద్ద రాధా రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో ప్రతి ఏటా మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని భీమవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు, స్థానిక ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు తెలిపారు. స్థానిక మాదివాడ సెంటర్‌లో సోమవారం మజ్జిగ చలివేంద్రంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా మజ్జిగ చలివేంద్రంను రాధా రంగా మిత్రమండలి సభ్యులు నిమ్మల నాగు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. దాతల సహకారంతో ప్రతి రోజూ 2000 లీటర్ల మజ్జిగతో పాదాచారుల దాహార్తిని తీర్చడం గర్వించదగ్గ విషయమన్నారు. యువత చెడు వ్యసనాలకు వెళ్లకుండా ఇటువంటి సేవా కార్యక్రమాల ద్వారా మానవత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు నిమ్మల నాగు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎండీ మస్తాన్ వలీ, నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అంబటి రమేష్, దాసరి బాలకృష్ణ, పుప్పాల చిన్నా తదితరులు పాల్గొన్నారు.

6,7 తేదీల్లో ఎస్ఆర్‌కేఆర్‌లో అపూర్వ-24 వర్క్‌షాప్


భీమవరంలో వర్క్‌షాప్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 6 ,7 తేదీల్లో అపూర్వ-24 పేరిట ఆలుమిని వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కేవి మురళీకృష్ణంరాజు చెప్పారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ సోమవారం విడుదల చేసిన సందర్భంగా వివరాలను వెల్లడించారు. ఉన్నత స్థానాల్లో ఉన్న కళాశాల పూర్వ విద్యార్థులు వర్క్ షాప్‌లో ప్రస్తుత విద్యార్థులకు నూతన టెక్నాలజీకి సంబంధించిన మార్పులపై నూతన స్కిల్స్ అందించనున్నారన్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌లోని గోకరాజు రంగరాజు ఇంజనీరింగ్ కళాశాల ఈఈఈ విభాగం హెడ్ వి విజయరామరాజు, ఇంటెల్ సాఫ్ట్‌వేర్ సంస్థ నుంచి రవితేజరెడ్డి, గౌహతి ఐఐటీ నుంచి ఎ రవీంద్రనాథ్ తదితరులు విద్యార్థులకు శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమానికి కో- కో ఆర్డినేటర్స్‌గా ఎస్ శ్రీనివాస్, జిహెచ్‌కె వర్మ వ్యవహరిస్తారని మురళీకృష్ణంరాజు చెప్పారు.

రానున్న ఎన్నికల్లో బూత్ కమిటీలదే కీలక పాత్ర

ఇరగవరం: ఏలేటిపాడులో సోమవారం ఇరగవరం మండల నాయకులు బూత్‌లెవెల్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీపీ వెలగల సాయిబాబారెడ్డి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బూత్ కమిటీల పాత్ర కీలకమని అన్నారు. అందరూ కలిసికట్టుగా పని చేసి ఎమ్మెల్యేగా కారుమూరి నాగేశ్వరరావును, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా వరి పైరు

- అధిక దిగుబడుల దిశగా ఎంటీయూ 1293 వంగడం
- కుప్పనపూడిలో చెరువుల మధ్య సాగు


కుప్పనపూడిలో ఏపుగా ఎదుగుతున్న ఎంటీయూ 1293 వరి వంగడం

ఆకివీడు : నూతన వరి వంగడం ఎంటీయూ 1293 వంగడం దిగుబడులు ఆశాజనకంగా కన్పిస్తున్నాయి. రబీ సాగులో సెలనిటీని తట్టుకుని పంట అద్భుతంగా ఎదుగుతోంది. 2022లో మార్టేరు వరి పరిశోధనా సంస్థ ఈ వంగడాన్ని రూపొందించింది. ఎంటీయూ 1010, ఎఫ్ఎల్ 478బై3 సంకరణ ద్వారా ఎంటీయూ 1293 వంగడం రూపొందించారు. సాగు కాలపరిమితి 122 రోజులు కాగా, వరి మొక్క 120 నుంచి 125 సెంటీమీటర్ల ఎత్తు ఎదుగుతుంది. పడిపోయే గుణం లేదు. గింజ పొడవు, సన్నం, పొడవు, వెడల్పుల నిష్పత్తి 3.18. దీంతో దీనిని సూపర్ ఫైన్ రకం వంగడంగా గుర్తించి రైతులకు మినీ కిట్లుగా రబీ సాగులో మార్టేరు వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు అందజేశారు. చౌడు నేలల్ని తట్టుకుని, వరి కంకులు పుష్కలంగా గింజలతో గలగలలాడుతూ ఉంటాయి. పొట్టకుళ్లు, టుంగ్రో వైరస్, అగ్గితెగులు, గోధుమ రంగు తెగులును మధ్యస్తంగా తట్టుకుంటుంది. చౌడు నేలల్లో సాగుకు ప్రత్యామ్నాయ రకంగా శాస్త్రవేత్తలు గుర్తించినట్లు మార్టేరు శాస్త్రవేత్త కృష్ణాజీ చెప్పారు. ఎకరాకు దిగుబడి 1.5 నుంచి 2.2 టన్నులు, చౌడు భూముల ప్రాంతాల్లో 2.2 నుంచి 2.24 టన్నుల దిగుబడి వస్తుందని కృష్ణాజీ వివరించారు. కుప్పనపూడిలో ఆదర్శ రైతు నంద్యాల చల్లారావు పొలంలో వెదజల్లు, సాధారణ సాగు పద్ధతుల్లో ఎంటీయూ 1293 వంగడం సాగు చేసినట్లు ఆయన తెలిపారు.

లయన్స్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమాండ్స్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, గ్యాట్ అంబాసిడర్ కొత్తపల్లి రవి కుమార్ ఆధ్వర్యంలో స్థానిక భవిత కేంద్రంలో సోమవారం దివ్యాంగులకు స్నాక్స్, స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో యర్రా ఆంజనేయస్వామి, సత్యనారాయణ, భవిత సెంటర్ నిర్వాహకులు బాల ఈశ్వరయ్య, చంద్ర కుమారి పాల్గొన్నారు.

నవోదయకు ఎంపిక


నవోదయకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆకివీడు: నవోదయలో చదివేందుకు స్థానిక ఈస్టుపాలెం ఎంపీపీ స్కూల్ విద్యార్థిని యా. జోషిత శ్రీ వర్షిని ఎంపిక య్యారు. నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణతా మార్కులు సాధించిదని హెచ్‌ఎం వీ.వర్షిని సోమవారం విలేకర్లకు తెలిపారు. ఐదో తరగతి చదువుతున్న ఆమె ఆరో తరగతిలో ప్రవేశ పరీక్ష రాసినట్లు, ఏలూరు దగ్గర పెదవేగిలో నవోదయ స్కూల్‌లో త్వరలో చేరనున్నట్లు తెలిపారు.

ఎంపీపీ వెంకటరమణ రాజీనామా


జెడ్పీ సీఈఓ సుబ్బారావుకు రాజీనామా పత్రం అందిస్తున్న ఎంపీపీ వెంకటరమణ

యలమంచిలి: యలమంచిలి మండల పరిషత్ అధ్యక్షురాలు రావూరి వెంకటరమణ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని సోమవారం ఏలూరు వెళ్లి జిల్లా పరిషత్ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావుకు అందజేశారు. 2021లో జరిగిన మండల పరిషత్ ఎన్నికల సమయంలో జరిగిన ఒప్పందంలో భాగంగా ఆమె రాజీనామా చేశారు. ఆ సమయంలో వెంకటరమణకు, ఏనుగువానిలంక ఎంపీటీసీ సభ్యురాలు వినుకొండ ధనలక్ష్మికి చెరో రెండున్నరేళ్లు ఎంపీపీగా చేయాలని ఒప్పందం చేసుకున్నారు. ఎవరు ముందు ఎంపీపీ అనే విషయంలో టాస్ వేయగా వెంకటరమణకు మొదటి అవకాశం వచ్చింది. ఆ గడువు మార్చి నెలతో ముగియడంతో ఆమె రాజీనామా చేశారు.

వేధింపులు భరించలేకే ..


మార్టేరులో గ్రామ కార్యదర్శికి రాజీనామా పత్రాలను అందిస్తున్న వలంటీర్లు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలో పలువురు వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. తమ సొంత పనులు చేసుకుంటున్నా కొన్నిపత్రికలు, రాజకీయ నాయకులు తమపై వ్యక్తిగత నిఘాతో వేధిస్తున్నారని, తమను స్వేచ్ఛగా తిరగనివ్వని కారణంగానే రాజీనామా చేస్తున్నామని వలంటీర్లు పేర్కొన్నారు. మార్టేరు గ్రామానికి చెందిన డీజీవీ శేఖర్‌రెడ్డి, మేడపాటి సాయి, భోగేశ్వరరెడ్డి, స్టీపెన్‌జూల్జీ, వెలగలేరుకు చెందిన కె.కిశోర్, కల్యాణ చక్రవర్తి అనే వలంటీర్లు తమ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రాజీనామా పత్రాలను గ్రామ కార్యదర్శులకు సోమవారం అందజేశారు.

దోమల నియంత్రణ అందరి బాధ్యత

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమల నియంత్రణ అందరి బాధ్యత అని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలైన యాగర్లపల్లి, బీబీసెంటర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ల్లో సోమవారం డాక్టర్ శ్రావ్య, డాక్టర్ తనూజ అధ్యక్షతన ఆశా డే నిర్వహించారు.ఈ సందర్భంగా వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ కీటక నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు. ఆశ నోడల్ అధికారులు వై.సుజాత, ఎం.మంగతాయారు, వార్డు ఆరోగ్య కార్యకర్తలు, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: పట్టణంలోని డీ1 విద్యుత్ ఉపకేంద్రం వార్షిక నిర్వహణ పనుల కారణంగా మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈ.ఈ)పీర్ అహ్మద్ ఖాన్ సోమవారం చెప్పారు. పట్టణంలోని కలెక్టరేట్ ఏరియా, బొక్కవారిపాలెం, మల్లె తోట, చిన్నరంగనిపాలెం, హౌసింగ్ బోర్డ్ ఏరియా, ఇండస్ట్రియల్ ఏరియా, నరసయ్య అగ్రహారం, పార్క్‌స్ట్రీట్ ఏరియా, వేండ్ర కెనాల్ రోడ్, రామచంద్రపురం, కోడవల్లి రోడ్డు , సబ్ రిజిస్టర్ ఆఫీస్, మారుతీ నగర్, ప్రకృతి ఆశ్రమం, సంజన అపార్ట్‌మెంట్స్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు .

మహిళపై దాడి

ఉండి: సరిహద్దు గోడ వద్ద మొదలైన తగాదా మహిళపై దాడికి కారణమైంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం మహదేవపట్నం ఉప్పరగూడెం గ్రామానికి చెందిన కడలి లక్ష్మి ప్రహరీ గోడకు ఆనుకుని ఆమె బావ అయిన కడలి రాంబాబు గోడ కడుతుండగా అలా ఎందుకు కడుతున్నావంటూ అతని తమ్ముడు, లక్ష్మి భర్త అయిన రామాంజనేయులు ప్రశ్నించడంతో వాగ్వాదం చోటుచేకుంది. రాంబాబు కుమారుడు వెంకన్న ఇనుపరాడ్డుతో లక్ష్మి తలపై, ఛాతీపై కొట్టడంతో ఆమె గాయపడింది. దీంతో చికిత్స నిమిత్తం ఆమెను భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి నుంచి అందిన సమాచారం మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

బొండాడలో అన్నసమారాధన

కాళ్ల: బొండాడ గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఉండి మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నే నాగరాజు తెలిపారు. గ్రామంలో కొలువుదీరిన అమ్మవార్ల జాతర మహోత్సవాలు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత అమ్మవార్లకు వివిధ రకాల పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు. భక్తులు, దాతల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరై అమ్మవార్ల ప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నే నాగరాజు, పెద్దలు మన్నే శ్రీనివాసు, కందుల హనుమబాబు, మన్నే సోమేశ్వరరావు, మందపాటి రవి, కట్టా సుబ్బయ్య, పెనుమత్స రంగరాజు, కళ్లెంపూడి వెంకన్న, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి విరాళం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి కోటిపల్లి శ్రీనివాస రావు-ఆదిద్య భవానీ దంపతులు రూ.58,116 లను విరాళంగా ఆలయ ట్రస్ట్, కమిటి సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ట్రస్ట్, కమిటి సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు.